# ఇది ఆటకాదు

పొడుగు వెంకటేశ్వరరావు



ఏ.సీ. రూంలో రివాల్వింగ్ చైర్‌లో విలాసంగా కూర్చుని 'త్రీఫైవ్స్' సిగరెట్ తగలేస్తున్న శేషగిరి మమ్మల్ని చూసి ఆదాకరకంగా కళ్ళెగరేసాడు. ఆ చూపులో దర్పం, అతిశయం.

'నేను సుబ్రమణ్యాన్ని' అన్నాడు సుబ్రమణ్యం, ప్రక్క చూపులు చూస్తూ.

అవునన్నట్టుగా తలెగరేసాడు శేషగిరి అలక్ష్యంగా, అలవోకగా.

'ఇతను రాజారావు. మన క్లాసుమేట్. గుర్తు వచ్చాడా ?'

'అవును గదా' అన్నట్టు తలాడించి కూర్చో మన్నట్టు చెయ్యి వూపాడు శేషగిరి. కూర్చున్నాము. కాని అంతసేపూ నా వంటిమీద తేళ్ళు, జెర్రులు పాకినట్టు అన్పించింది. కాలేజిలో శేషగిరి, నేను, సుబ్రమణ్యం, మరి ఇద్దరం బెస్టు ఫ్రెండ్సుము. ఎంతో ఇదిగా కలిసి తిరిగినవాళ్ళము. ఆ పాతరోజులు పోయాయి. కొత్తరోజులు నడుస్తున్నాయి. మారిన



రోజులతోపాటు మనుషులూ రంగులు మార్చి కొత్త అవతారాలెత్తారనటానికి వీడు — ఈ శేషగిరి బలమయిన సాక్ష్యం. అప్పుడు పిరికిగా పీచులాగా వుండే శేషగిరి ఇప్పుడు గుమ్మడికాయలాగై, రంగు వచ్చి, ధైర్యంగా దర్పంగా అవుపిస్తున్నాడు. మేము అక్కడ కూర్చున్న పది నిముషాలలోను శేషగిరి మాకు ఒక అర నిముషం కూడా స్పేర్ చేయలేకపోయాడు. నాకు వొళ్ళంతా మంటలు మండినట్లయింది. డర్టీ రాస్కెల్ ! అంతా, తెచ్చిపెట్టుకున్న బిజీనెస్ అని నేను గ్రహించకపోలేదు.

'వస్తాం, శేషగిరీ.' అని లేచి నిలబడ్డాను. నాతోపాటు సుబ్రమణ్యమూ.

'ఓ.కే ! చూస్తు వున్నారుగా. క్షణం వూపిరాడదు' అని, 'అలాగే పోయిరండ్రా, బికారి వెధవల్లారా' అన్నట్టు చూపు విసిరి, చేయి వూపి అనుమతిని మంజూరు చేశాడు శేషగిరి. బయటికి వచ్చాము.

'ఈ శేషగిరిగాడు, ఎంత మారిపోయాడ్రా !?' అన్నాను ఆశ్చర్యాన్ని అపుకోలేక.

'అందుకే, నేను వద్దన్నాను' అన్నాడు సుబ్రమణ్యం. ఆ మాట నిజమే. శేషగిరిగాడు పెద్ద క్లాత్ బిజినెస్‌మాగ్నెట్ అయ్యాడంటే — ఎగిరి గంతేసి — వద్దంటున్నా వినకుండా, శేషగిరిని చూసి తీరాలని పట్టుబట్టినందుకు నాకు గట్టిగానే చెంప దెబ్బతగిలింది. ఆ వూళ్ళోనే గుమాస్తాలుగా ఏడుస్తున్న మా రాజునీ, రంగడ్నీ చూద్దామన్న సుబ్రమణ్యం మాటని నేను తోసిపారేసాను. శాస్తి జరిగింది.

జీవితంలో కొన్ని కొన్ని సంఘటనలు యాదృచ్ఛికంగా జరిగిపోతుంటాయి. అనుకున్న దొకటయితే జరిగేది మరొకటిలాగ వుంటుంది. బందరు వెడదామని బయలుదేరినవాడ్ని—రైలు ఆ వూరి స్టేషన్లో ఆగగానే—నా మనసును తాళ్ళు కట్టి బలంగా లాగినట్లనిపించింది — ఒక సెంటిమెంటు, ఒక చిన్న ఆపేక్ష నా గుండెలలో అలజడి రేపగా—బ్రీఫ్‌కేసు తీసుకుని అర్థాంతరంగా ఆ వూళ్ళో దిగిపోయేను. అదృష్టం కొద్దీ సుబ్రమణ్యం వూళ్ళోనేవున్నాడు. కాలకృత్యాలు తీర్చుకున్నాక వూరు చూసివద్దామని బయలుదేరాము. ఆనాటి మా కాలేజి బిల్డింగు బోసిపోయినట్టుగా వెలిసిపోయి మసిగొట్టుకునివుంది. ఆ బిల్డింగు వైపుచూస్తూ వుంటే దిగులుగా అన్పించింది. ఇపుడు అక్కడ ఫుడ్ కార్పొరేషను గోడవునులు చోటు చేసుకున్నాయట. వూరి బయట స్వంత బిల్డింగులు కట్టుకుని కాలేజీ అక్కడికి మారిందని అన్నాడు సుబ్రమణ్యం. కాలేజికి ఎదురుగావుండే కాకా హొటళ్ళు, కిళ్ళీకొట్లు అక్కడలేవు. కాలేజీ ప్రక్కగా పారుతూవున్న పంటకాలువ మాత్రం కొబ్బరిచెట్లతో నిండుగా అలాగేవుంది. కొబ్బరి చెట్లు మాత్రం ముసిలివయిపోయాయి. ఆ ప్రక్కన పచ్చగ కళకళలాడుతూ వుండే పంటపొలాలు పోయి అక్కడ ఇళ్ళు వెలిసాయి. వూరు పెరిగింది. ఆకారం మారింది. ఆ కాలవగట్టున వంతెనమీద కూర్చుని చాలాసేపు మాట్లాడుకున్నాము. జ్ఞాపకాల్ని నెమరు వేసుకున్నాము. మాట్లాడింది నేను. అదంతా విన్నవాడు, సుబ్రమణ్యం. ఆ తర్వాత ఇద్దరం కలిసి వూరంతా తెగతిరిగాము. సెంటర్లో శంకర విలాస్ అలాగే వుంది. ఆ ప్రక్కనవుండే బట్టలషాపు మాత్రం మారిపోయింది. డాబా స్థానంలో మేడ వచ్చింది — ఎయిర్ కండిషనింగ్ చేశారుట. ఆ ప్రక్కనవుండే బస్టాండు వూరి బయటికి మార్చారుట. అలనాటి రెండు సినిమా హాళ్ళూ వెలిసిపోయి కళతప్పి అలాగే మురిగ్గా, ముసిలితనం వచ్చి నిలబడివున్నాయి. వాటికి జతగా, హంగామాగా మరో మూడు కొత్త సినిమాహాళ్ళు వచ్చాయి. రోడ్డు ప్రక్కన వుండే పాకలు పోయి షాపులు వచ్చాయి. గతుకుల మురికి రోడ్డుకి తారుపడి, మెయిను బజారు అన్పించుకునే అర్హత సంపాదించుకుంది. వూరు మారింది. బాగా మారింది. అదీ దాని పరిస్థితి. ఎన్నాళ్ళకి చూసాను — మళ్ళీ !

వూరంతా తిరిగి తిరిగి కాళ్ళకి దుమ్ము కొట్టుకుని—భోజనం వేళకి సుబ్రమణ్యం ఇంటికి చేరాము. కాళ్ళు కడుక్కున్నాక, భోజనానికి పిలిచాడు సుబ్రమణ్యం. పీటలమీద కూర్చుంటూనే నోరూరించే వాసనలు ! వేడి వేడి అన్నం,

# "వీణ" వింటే "వీణ" వాయిస్తే కొన్ని రోగాలు నయం కావచ్చును!

**సంగీతం రోగ ఉపశమనం చేయగలదా!?**

పై విషయంలో అన్వేషణలు జరపటానికి ఒక అమెరికన్ యువతి మదరాసు వచ్చింది. ఈమె పేరు హోప్ ఏవా కెల్మెన్, మిషిగన్ యూనివర్సిటీ రీసెర్చి స్కాలర్.

"వీణా" నాదానికి ఈ మహత్తర శక్తి ఉన్నదని కెల్మెన్ అభిప్రాయం. "సరస్వతి — ది హీలింగ్ పవర్ ఆఫ్ మ్యూజిక్" అనే అంశంపై ఈమె మదరాసులో పరిశోధనలు చేస్తున్నది.

"వీణ నేర్చుకొనటానికి చాలా కాలం పడుతుంది. వీణ వాయించగలనన్న మధుర భావన నాలో ఏర్పడిన మరుక్షణమే నాలోని అన్ని రుగ్మతలు తొలిగిపోయాయి. అది నాలో ఏర్పడిన మానసిక భావన కావచ్చు. అయినా ఆ భావన నా శరీరాన్ని ప్రక్షాళన గావించింది" అంటుంది కుమారి కెల్మెన్.

మూడు కోణాలనుంచి ఈమె తన పరిశోధనా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది. కళ, మానసిక శాస్త్రం, తత్త్వ శాస్త్రం — ఈ మూడు శాస్త్రాలను ఒకేసారి అధ్యయనం చేస్తూ, సంగీతం సహాయంతో మానసిక సమస్యలను పరిష్కరించటానికి మిస్ కెల్మెన్ కృషి చేస్తున్నది.

ఇదొక అసాధారణ సిద్ధాంతం. ఈ సిద్ధాంత రూపకల్పనలో కళాక్షేత్ర, మదరాసులోని యూనివర్సిటీ వుమన్స్ ఎసోసియేషన్ ఈమెకు తోడ్పడుతున్నాయి. ఈ ఎసోసియేషన్ మిస్ కెల్మెన్‌కి 4,800 రూపాయల ఉపకార వేతనం మంజూరు చేసింది. యూనివర్సిటీ వుమన్స్ ఎసోసియేషన్ల ఇంటర్నేషనల్ ఫెడరేషన్‌లో ఈ ఎసోసియేషన్‌కి భాగస్వామ్యం ఉన్నది.

మిస్ కెల్మెన్, మిషిగన్ యూనివర్సిటీలో ఎడ్యుకేషన్ సైకాలజీలో గ్రాడ్యుయేటు చదువులు సాగిస్తూ, "వైద్యానికి కళలు" అనే అంశంమీద కూడా కృషి చేస్తున్నది. "వ్యాధిని కుదర్చటంలో సైకాలజీ ఎలా పనిచేస్తుందో పరిశోధించాలనుకొంటున్నాను. ఇందుకు సంగీతం ఎంతవరకు తోడ్పడగలదో చూడాలనికూడా నా అభిలాష" అంటుందామె.

"వీణ వాయించటం ఒక ఆధ్యాత్మిక సాధనలాంటిది. దీనిద్వారా మానసిక ఏకాగ్రత సాధించవచ్చు" అంటుంది మిస్ కెల్మెన్.

మిస్ కెల్మెన్ ఇండియాకు రాక పూర్వం మేసచుసెట్స్‌లోని యామ్‌హెర్స్ట్ సంగీత పాఠశాల అధ్యక్షులు ప్రొఫెసర్ డేవిడ్ రెక్ దగ్గర వీణా వాద్యంలో ప్రాథమిక పాఠాలు అభ్యసించింది. ప్రొఫెసర్ రెక్ కూడా పది, పన్నెండేళ్ల క్రితం కళాక్షేత్రంలో వీణ నేర్చుకొన్నారు. "నిజానికి నేను బౌద్ధ తత్త్వంలోని టిబెట్ వైద్య విధానం అధ్యయనం చేయాలనుకొని ఇండియా వచ్చాను. ఇక్కడికి వచ్చిన తరువాత వీణా వాద్యం నన్ను ఆకట్టుకొన్నది" అన్నది మిస్ కెల్మెన్.

కళాక్షేత్రంలో శ్రీ టి. ఎన్. రామచంద్ర అయ్యర్ శిష్యురాలుగ కుమారి కెల్మెన్ చేరింది. కుమారి కెల్మెన్ పూర్తి శాకాహారి. కళాకారుల కుటుంబంలో ఈమె జన్మించింది. ఈమె తల్లి నర్తకి. మిస్ కెల్మెన్ కూడా నృత్యం చేయగలదు, పియానో కూడా వాయిస్తుంది.

సంగీతం మృదువుగా, లలితంగా, శ్రావ్యంగా ఉండాలని కెల్మెన్ అంటుంది. నేటి పాశ్చాత్య తరహా "ధామ్" ధామ్ సంగీతం ఈమెకు నచ్చదు.

[భాస్కరన్ తామస్]

## ఇది ఆట కాదు


దోసకాయ పచ్చడి, ఆవకాయ, వంకాయ వేపుడు, బీరకాయ కూరా, కమ్మటి నెయ్యి, పులుసూ, మజ్జిగచారు, వడియాలు, పెరుగూ. మజ్జిగచారు నాకు చాలా ఇష్టమని లలితకి బాగా తెలుసు. లలిత నన్ను మరిచిపోలేదు! ఆ అమ్మాయి సుబ్రమణ్యం చెల్లెలు. మా నాన్నగారు ఆ వూళ్ళో చాలాకాలం వుద్యోగం చేసారు. వుద్యోగస్తుడి కొడుకును గనుక నేను, ఐరన్ చేసిన బట్ట నగలకుండా నీట్‌గా ట్రిమ్‌గా వుండేవాడ్ని. సుబ్రమణ్యం వాళ్ల ఇల్లు మా ఇంటి ప్రక్కనే. మాది డాబా ఇల్లు. వాళ్లది వంగి వాలిపోయిన పెంకుటిల్లు. సుబ్రమణ్యం నాన్న ఏదో చిన్న ఉద్యోగం చేస్తూ, సుబ్రమణ్యాన్ని అతికష్టంమీద చదివిస్తూ వుండేవారు. లలిత చామనచాయ రంగులో వుండేది. కాని ఆ పిల్లని చాలా పెద్ద అందమయిన కళ్ళు, ముక్కు, పెదాలు చాలా ఆకర్షణీయంగ వుండేవి. తుమ్మెద రెక్కల్లాంటి వొత్తయిన గిరజాల జుత్తు, కుదమట్టమయిన శరీరం. అప్పుడప్పుడే యవ్వన ప్రాదుర్భావ దశలో అడుగుపెడుతూవున్న ఆ అమ్మాయి నన్ను ఆకర్షించిందనాలి. నేను తరచూ సుబ్రమణ్యంగారి ఇంటికి వెళ్తూ వుండేవాణ్ణి. అందుకు సుబ్రమణ్యంతో నా స్నేహం ఒక సాకు మాత్రమే. ఆ ఇంట్లో నాకు బాగా మర్యాదలు జరిగేవి. సుబ్రమణ్యంతల్లి డబ్బాల్లోంచి చేగోడీలు, కారప్పూస తెచ్చిపెట్టి తినమని బలవంతం చేసేది. ఆప్యాయంగా మాట్లాడేది. సుబ్రమణ్యం తండ్రి గొప్పగా కబుర్లు చెప్పేవాడు. ఎంతో అభిమానాన్ని గుమ్మరించేవాడు. ఆ మర్యాదల్ని అందుకుంటూ గర్వంగా పోజులు కొట్టేవాడ్ని నేను.

నేను తరచూ వాళ్ల ఇంటికి వెళ్లటం మా అమ్మకి ఇష్టం వుండేది కాదు. ఆ విషయంలో ఆమె నన్ను ఒకటి రెండుసార్లు హెచ్చరించింది. కాని ఆమె మాటల్ని నేను పెడచెవిని పెట్టాను. అందువలన ఆమె మా నాన్నకి ఎక్కించింది. మా నాన్న గొప్ప లౌక్యుడు. అందువలన మాటల్ని మాలలుగా కట్టి నా మనసుని మార్చటానికి ప్రయత్నించాడాయన.

వాళ్లు పేదవాళ్లు. మేము వున్నవాళ్లము. మాకూ వాళ్లకీ చాలా అంతరముంది. అందువలన అటువంటి వాళ్లతో మాకు సంబంధాలు వుండరాదు. తక్కువ అంతస్తు గలవాళ్లకి పై అంతస్తు వాళ్ల మీద కొన్ని దురాశలు వుండే అవకాశం వుంది. వాళ్ల మాటల్లో, చేతల్లో, మర్యాదల్లో— ముసుగు కప్పుకున్న ఒక ఆశాపాశం వుంటుంది. ఆ వలలో తగుల్కొకుండా తప్పించుకుని తిరగటం తెలివి గల వాళ్ల లక్ష్యం — ఇదీ ఆయన మాటల సారాంశం. అందుకు ఎన్నో దృష్టాంతాల్ని తన అనుభవాల్లోంచి ఎత్తిచూపించారాయన. అంతా చెప్పి— నీవూ తెలీని వాడివిగాదు. పెద్దవాడివవుతున్నావు. ఆలోచించి నిర్ణయించుకోదగిన స్థాయికి ఎదుగుతున్నావు. నీకు నువ్వే నిర్ణయించుకో — అంటూ లౌక్యంగా జారుకున్నారు. నేను ఆయన మాటల గురించి ఆలోచించాను. నిజమే. అందులో కొంత వాస్తవం వుండకపోలేదు.

వాళ్ల మాటలు, ఆప్యాయతలు, మర్యాదల వెనుక ఒక లక్ష్యం లేకపోలేదనిపిస్తుంది. లలితకీ నాకూ ఈడూజోడూ. నేను లలితని పెళ్లి చేసుకుంటే వాళ్ళు ఎంతో సంతోషిస్తారు. గుండెలమీద కుంపటిని వదిలించుకుని తృప్తిగా నిట్టూర్చే అదృష్టాన్ని అందుకోగలరు. ఆ అభిప్రాయం సుబ్రమణ్యం తలిదండ్రుల మనసులో వుందని నాకు తెలుసు. నాకు ఇంకో విషయం కూడా తెలుసు. ఎప్పటికీ వాళ్లు బయటపడలేరు. నోరు విడిచి, 'మా లలితని చేసుకోరాదా' అని నన్ను వాళ్లు అడగలేరు. అందుకు పెద్ద 'రీజను' వుంది. లేనివాడికి వున్నవాడ్ని, బలహీనుడికి బలవంతుడ్ని చూస్తే కలిగేది పిరికితనం. అలాగే పెంకుటింటి పేలోకి డాబావార్ని చూస్తే భయం. ఆ రకమయిన దిగులూ, ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సూ వాళ్లని అలుముకుని వుంది. నేను అందగాడ్ని! అన్నీ వున్నవాడ్ని అన్న ఆ గర్వం, దర్పం నాలో పుష్కలంగా వున్నాయి నా రక్తంలోనే వుంది. నా పెరుగుదలతోనే అవి పెరిగి మరింత బలంగా రూపుదిద్దుకుంటున్నాయి కాని అవి బయటపడవు. అది నా అభిజాత్య లక్షణం ఏమీ తెలియని అమాయకుడిలాగ పైకి నటిస్తూ ఇన్ని రకాల ఆలోచనలకి బుర్రలో చోటిస్తూ వున్న నన్ను గురించిన వాళ్ల అంచనా ఎటువంటిదయినా నన్ను నిలవేసి అడిగే ధైర్యం వాళ్లకి లేదు. తీరా బయటపడి అడిగితే — ఒకవేళ నేను తిరస్కరిస్తే వాళ్ళు వెలితిపడటమే మిగిలేది. అందువలన ప్రస్తావన వచ్చేదిగాదు.

[44వ పేజీ చూడండి]



'జే గంటలు'లో ఒక సన్నివేశం

# ఇది ఆట కాదు

[ 32వ పేజీ తరువాయి]

తరచూ వాళ్ల ఇంటికి వెళ్ళటం, మర్యాదల్ని అందుకోవటం, లలితని చూడటం, ఆమె గొంతు వినటం నాకు ఎంతో తృప్తిని ఇచ్చేది. నా గుండెల్లో ఆనందం లావాలా పొంగి ప్రవహించేది. నా నరాలలో గొప్ప రిలీఫ్ అన్పించేది. మనసు పొరలలో అవ్యక్తమయిన అనుభూతి వ్యక్తావ్యక్తంగా దోబూచులాడేది. అందులో స్వార్థం వుంది. నా నడవడిలో సూటిదనం లేదు. ఆ కారణంగా గిల్టీగా ఫీలయినా ఆ ఫీలింగుని అణచిపెట్టి తొక్కివేసేవాడిని.

ఒకసారి నేనూ, సుబ్రమణ్యం బజారు వెళ్ళినపుడు — అతను ఎన్నో షాపులు తిరిగి కష్టపడి ఆడవాళ్లకి ఇవ్వదగిన ఒక చక్కని బహుమతిని కొన్నాడు.

'ఏవిట్రా సంగతి?'

'ఏమీ లేదులే' అని దాటవేయబోయాడు సుబ్రమణ్యం.

'లవ్ ఎఫేరా? సీక్రెటా?!'— కన్ను గీటాను.

సుబ్రమణ్యం సిగ్గుపడి — 'నీవు అనుకున్నది కాదులే' అన్నాడు. ముడుచుకుపోయాడు.

'డొక్క చించుతాను. వెధవ్వేషాలూ నువ్వూ. నాకు తెలీదనుకున్నావా ? ఈ సంగతి మీ నాన్నకి చెప్పకపోతే అప్పుడడుగు' అని బెదిరించాను. అపుడు బయటపడ్డాడు వాడు.

'ఈ ప్రజెంటేషన్ మా చెల్లాయికిరా. లలిత టెన్త్ పాసయింది. ఆ సంతోషంకొద్దీ అన్నగా చిన్న.........'

'మరి నాకెందుకు చెప్పవురా ఫూల్!' — అని వాడ్ని కోప్పడ్డాను.

సుబ్రమణ్యం నవ్వాడు. సిగ్గుపడ్డాడు. ఆ నవ్వులో నిస్సహాయత,ఆ సిగ్గులో ఇన్‌ఫీరియారిటీనెస్! లలిత టెన్త్ పాసయితే, అందుకుగాను వాడు చెల్లెలికి ప్రజంటేషను ఇస్తే ఆ సంగతి వాడు నాకు చెప్పాల్సిన అవసరం ఏమిటి? చెప్పలేదని వాడ్ని నేను దబాయించటంలో ఔచిత్యం ఎంత ?

అనిపించి నా ప్రవర్తన నాకే నవ్వు తెప్పించింది. వాడినుంచి ఆ ప్రశ్న రాదు. అందుకు కారణం వాడు నాకంటే క్రిందమెట్టులో వుండటమే. అదే లేకపోతే వాడు ఆ మాటనే అడిగి నా మొహం బద్దలుకొట్టేనంత పనిచేసేవాడు.

ఆ సాయంత్రం నేను వాళ్ళింటికి వెళ్ళి, నేను లలితకోసం తీసుకున్న 'పార్కర్ పెన్ను'ని ఆమెకి ఇచ్చి కంగ్రాట్యులేషన్స్ చెప్పాను. సుబ్రమణ్యం తలిదండ్రులుసంతోషించినట్లు కనిపించారు. ముసలావిడ రవ్వలడ్లూ, బూందీ తెచ్చిపెట్టింది. ముసలాయన సంతోషంగా కబుర్లు చెప్పాడు. సుబ్రమణ్యం వెర్రిమొహం వేసుకుని కూర్చున్నాడు. లలిత థాంక్సు చెప్పి లోపలికి వెళ్ళిపోయింది.

నాకు తెలుసు. నా మనసు లలితమీద లగ్నమయి వుంది. కాని లౌకికమయిన కొన్ని బంధనాలు నన్ను వేరే దారిని నడిపిస్తున్నాయి. కోరికను చంపుకోలేను. ధైర్యంచేసి ముందడుగూ వేయలేను. ఒక రకమయిన యువతరానికి ప్రతినిధిని నేను. ముసలాయనా, ముసలావిడా నామీద ఆశలు పెంచుకుంటున్నారు. అందుకు అవసరమయిన అవకాశాన్ని నా ప్రవర్తన కలిపిస్తూవుంది. కాని ఒక సంశయం, పిరికితనం వాళ్ళని పట్టి బంధిస్తూవుంది. వాళ్ల చూపుల్లో ఆ ఆశ దోబూచులాడుతూ వుంది. కాని అది బయటపడదు. పేదరికం లేకితనాన్ని, లేకితనం పిరికితనాన్ని పుష్కలంగా అందించగలవు. అదే నాకు శ్రీరామ రక్ష. లేకుంటే నావంటి రాస్కెల్స్ మనసులోని మురికితనం ఎప్పుడో బయటపడేది. నేను మనుషులతో ఎంత క్రూరంగా ఆడుకుంటున్నాను! చంచలమయిన నా యువక మనస్సు ఎంతటి భయంకరమయిన మార్గాన ప్రయాణంచేస్తున్నది?! చివరికి నేను వాళ్లని ముంచనుగదా!

మృష్టాన్నాన్ని సుష్టుగా తిని ఆరుబయట మంచంమీద పడుకునివున్న నన్ను ఒకనాటి ఈ ఆలోచనలు దోమల్లాగ ముసిరాయి. నా మనసుకు చికాకును కలిగించాయి. ఆందోళనా భరితమయిన నా గుండెలకి మరింత గాయాలు చేసి నన్ను శిక్షించాయి.

'ఏమిటి రాజా! ఆలోచనలో పడినట్లున్నావు?' అంటూ వచ్చి నా ప్రక్క మంచంమీద పడుకున్నాడు సుబ్రమణ్యం.

'సుబ్రమణ్యం! ఏమిటి ఇంకా నీ విశేషాలూ?' అన్నాను. సుబ్రమణ్యం తన గొడవ చెప్పుకొచ్చాడు.

తండ్రి పోయాడు. కుటుంబ భారం బుజాల పైన పడింది. అందువలన పై చదువులు చదవలేక చాలీచాలని జీతం అందించే చిన్న ఉద్యోగంలో కుదురుకున్నాడు. ఏదో—జీవితం గడిచిపోతూవుంది. జీవితంలో బరువు చోటు చేసుకుంది. ఆనాటి రోజులు, ఆ స్నేహితులు, ఆ ముచ్చటలు తల్చుకుంటే దిగులుగా అన్పిస్తుంది. పెళ్ళి చేసుకోమని పోరుపెడ్తుంది తల్లి. కని తనకే ఇష్టంలేదు. లలితకి పెళ్లి చేయాలని ఎన్నాళ్లుగానో ప్రయత్నిస్తూవున్నాడు.కాని ఆ పెళ్ళి చేయలేకపోయాడు. కారణం, ఆకాశాన్నంటుతూవున్న కట్నాలు. స్వంతకాళ్లమీద నిలబడే ధైర్యంలేక ఈనాటి యువకుడు కట్నాన్ని నమ్ముకుని ఆత్మవంచన చేసుకుంటున్నాడు. ఈ పరిస్థితుల్లో పెళ్లి చేసుకుని మరొక బరువుని మెడకి తగిలించుకోనటాన్కి ఇష్టంలేదు తనకి—

అలాగ చెపుతూ చెపుతూనే గుర్రుకొట్టి నిద్రలోకి జారిపోయాడు సుబ్రమణ్యం.అదృష్టవంతుడు! నాకు నిద్రపట్టలేదు. బాగా ప్రొద్దుపోయింది. ఆకాశంలో చంద్రుడు. మనసు నిండా ఆలోచనలు. ఇప్పటి నా బందరు ప్రయాణానికి కారణం వుంది. బందరులో రమణయ్యనాయుడుగారని పెద్ద ప్లీడరుగారున్నారు. ఆయన బాగా సంపాదించాడు. ఆయన మా నాన్నగారికి మంచి ఫ్రెండు. మా కుటుంబాల మధ్యన రాకపోకలు వున్నాయి. రమణయ్యనాయుడుకి ఒక కూతురు వుంది. ఆ అమ్మాయి పేరు సబిత.

ఎర్రటి శరీరచ్ఛాయ, మెరుపులాంటి అందం. మంచి మాటకారి. బి.ఏ. చదువుతూవుంది. కాని సబితలో కొంత అతిశయం, గర్వం వున్నాయనిపిస్తుంది. సబిత మంచిదే. కాని మాట పెళుసు. ఒక్కటే సంతానం కావటం వలన గారాబంగా పెరిగింది. వెనుక బోల్డంత ఆస్తివున్న సబితని కోడలుగా చేసుకోవాలని మా వాళ్ళు కొంతకాలంగా ఆలోచనలు చేస్తూ వుండటం నాకు తెలుసు. డబ్బా ఇంటివాడు మేడల దొరవైపు లేకిగా చూసినట్టు!

సబితమీద నాకు అయిష్టం లేదు. వాళ్ళ హంగూ, ఆస్తీ అంతస్తులమీద వ్యామోహం!

ఆమె ప్రవర్తన నాకు నచ్చలేదు. కాని ఆమె అంతస్తూ, అందమూ నన్ను ఆకర్షించాయి. అందువలన నేను రాజీపడ్డాను. ఏ విధంగా చూసినా వాళ్ళ అంతస్తు మా కంటె పెద్దది. అందుచేత పైచూపులోవున్న నేనూ ఇష్టపూర్వకంగానే మొగ్గుచూపాను.

## కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితం మీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి. ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగా వుండాలి. అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్‌మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్లలు అంటించిన కవరు గల కార్టూన్‌లను త్రిప్పి పంపడం జరుగుతుంది — దారిలో పోయేనాటికి మా బాధ్యత లేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్లలో అన్నీ గాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది — పరిశీలనకి ఐదారు వారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు—బాగా ముందుగా వాటి కవరు మీద ఆ ''ప్రత్యేక'' సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితం మీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

— సం॥

# ఇది ఆట కాదు

ఆ మధ్యన రఘునయ్యనాయుడుగారు మా ఇంటికి వచ్చినపుడు మా వాళ్ళు ఆ సంగతి కదిపారు. ఆయన కాదనలేదు. మా వాళ్ళ వేడికోలును ఆయన ఔదార్యంతో మన్నించారు.

'మన స్నేహం ఈ విధంగా బలపడటం నాకూ ఇష్టమే. కాని మనది ఏముంది? పెళ్ళి చేసుకుని కాపురం చేయవలసింది వాళ్ళు. అందువలన అమ్మాయీ, అబ్బాయీ ఇష్టపడితే ఆ శుభకార్యం కానిచ్చి చేతులు దులుపుకుందాం. అందువలన — ఒకసారి ఆ బ్బాయిని అక్కడికి పంపించండి. మాటల్లో నేనే విషయాన్ని కదుపుతాను. అమ్మాయి సరేనంటే మహాబాగు. పైగా వాళ్ళు పెళ్ళిచూపులూ చూసుకున్నట్లవుతుందిగదా.' అన్న ఆయన మాటను పట్టుకుని నన్ను పంపించారు మా వాళ్ళు—ఇప్పుడు.

నా మనసులో గుబులు గుబులుగా వుంది.

నా గురించి సబిత అభిప్రాయం ఏమిటి? ఆ అమ్మాయి నన్ను పెళ్ళి చేసుకోవటానికి ఇష్టపడుతుందా? గర్వం, మిడిసిపాటుతనం ఆవరించగా తెలిసీ తెలియని తనంతో క్రూరంగా నిరాకరిస్తుందా? ఎవరి మనసు ఏ సమయంలో ఎలాగ నడుస్తుందో స్పష్టంగా కనిపెట్టలేముగదా! నేను పిహెచ్.డీ. చేస్తున్నాను. 'బ్రిలియంట్'గా పేరు తెచ్చుకున్నాను. గొప్ప శాస్త్రజ్ఞుడుగా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవటం నా ధ్యేయం. వెనకాల నాకు కొద్దో గొప్పో ఆస్తిపాస్తులున్నాయి. అందగాణ్ణేనని నా అభిప్రాయం. సబితతో నాకు పరిచయం వుంది, గాని అది గాఢమయినదిగాదు.

నా ప్రయత్నం ఏమవుతుంది? సబిత ఏమంటుంది?

నా ఆశ ఫలిస్తుందా? నిరాశే ఎదురయితే ఆ భంగపాటుకి నా గుండె, నా 'ఇగో' తట్టుకుని నిలబడగలదా?

ఈ చీకాకుకు తోడు నా మనసు పొరల అంచుల్లో స్పష్టాస్పష్టంగా ఇంకా నిలిచి కలవర పెడుతున్న ఈ లలిత. లలిత! అవునూ—ఎంతో పరిచయం వున్నా—ఎన్నాళ్ళకో నేను మరల ఆ ఇంటి గడప తొక్కినా—మునలావిడగానీ, లలితగానీ, నా ఎదుటికి రాలేదు. పలకరించనే లేదు. ఎంత చిత్రం! ఈ సంగతి నేనూ ఆలోచించలేదు, ఒక్కసారికూడా!

నా వెనకాల ఏదో చప్పుడయింది!

గబుక్కున లేచి కూర్చున్నాను. గుడ్డివెన్నెలలో తెల్లతెల్లగా——

'ఎవరూ?'

సమాధానం లేదు. దగ్గరకి వెళ్ళి చూసాను. ఆ వ్యక్తి లలిత!

'లలితా!'

'.........'

'బావున్నావా లలితా? మీ అమ్మగారు బాగున్నారా? మాట్లాడటం ఇష్టంలేదా?'

'మా అమ్మకి జ్వరంగా వుంది. వేడినీళ్ళు కావాలి. పొయ్యి అంటించటానికి బొగ్గుల కోసమని వచ్చాను' అంది లలిత. ఆ సమాధానం నాకు రుచించలేదు. లలితని పరిశీలించసాగాను.

'ప్లీజ్! ఒక నిముషం ఆగరూ. మీతో పని వుంది. ఇప్పుడే వస్తాను' అని బొగ్గులు తీసుకుని వెళ్ళిపోయింది లలిత.

తనకి నాతో ఏమిటి పని? ప్రేమించానంటుందా? పెళ్ళి చేసుకోమంటుందా? లేకపోతే ఏమిటా పని? ఆ మాటే అడిగితే ఏం సమాధానం చెప్పాలి? నీ మీద నాకూ ఇష్టం వుందిగానీ పెళ్ళి మాత్రం చేసుకోలేను, అనగలడా, తను?! అని — ఆమెను చూస్తూ ఆమె ఎదుట నిలబడగలడా? లలిత రియాక్షన్ ఎలాగవుంటుంది? కన్నీరు మున్నీరయితే తను సహించగలడా? ఎంత అసహ్యమయిన పరిస్థితి! ఛీ.

పది నిముషాలలో వచ్చింది, లలిత. మనసుని రాక్షసంగా మార్చుకుని నేను తయారయేవున్నాను. ఆ సంగతి ఆ పిల్లకేం తెల్సు? పాపం! అమాయకురాలు.

'ఇది మీ వస్తువు. ఇన్నాళ్ళూ అనవసరంగా నా దగ్గర వుండింది. పట్టుకెళ్ళండి' అంటూ ఆ వస్తువుని నా చేతిలో పెట్టి గిర్రున వెనుదిరిగి వెళ్ళి పోయింది లలిత.

అది—లలితకి ఎప్పుడో నేను ప్రజంట్ చేసిన పార్కర్ పెన్ను!

నా అహానికి దెబ్బ తగిలింది.

నా గుండెలమీద బలంగా గుద్దినంత బాధ. ఆ బాధని భరించలేక కసిగా పెదాలు కొరుక్కున్నాను. అప్పుడే గనుక లలిత ఇంకా నా ఎదురుగా నిలబడి వుంటే నేను ఏమిచేసేవాడినో నాకు తెలియదు. అహం దెబ్బతిన్నప్పుడు విచక్షణకి తావెక్కడ? ఆ పరిస్థితిలో ఏమిచేసి నా కసిని తీర్చుకున్నా, ఆ పేదరాలు, అమాయకురాలు, అసహాయురాలు ఏమి చేయగలదు? కాని లలిత క్షణం ఆగకుండా పారిపోయింది.

నా వంటిమీద కారం చల్లినట్లనిపించింది. ఇంక నేను క్షణంకూడా అక్కడ వుండలేను వెంటనే సుబ్రమణ్యాన్ని తట్టి నిద్రలేపాను.

'టయిముకి టయిమయింది. పోదాం పద' అన్నాను.

నా సూట్‌కేసు తెచ్చి, నన్ను అనుసరించాడు సుబ్రమణ్యం. స్టేషనులో గంటన్నరసేపు పడిగాపులు పడి నన్ను రైలు ఎక్కించి వెళ్ళిపోయాడు సుబ్రమణ్యం. ఆ వూరు వెనుకనడిపోయింది. ఆ మనుషుల్ని మదిలోనుంచి దూరం చేసుకుంటానికి ప్రయత్నించాను. ఇపుడు నా మనసు అందమయిన భవిష్యత్తుకోసం పరుగులు పెడుతోంది. రైలుకంటే ఎక్కువయిన వేగంతో ప్రయాణిస్తోంది. అస్థిరత నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూంది!

సబిత —

అందం, అభిజాత్యం, అతిశయం నిండిన సబిత! లక్షాధికారి ఏకైక కుమార్తె.

సబిత నా భార్య అవుతుందా? నా కోరిక సఫలీకృతమవుతుందా?

నా మనసంతా ఇవే ఆలోచనలు.

ఇది కేవలం ప్రేమకథ గాదు. ప్రేమగా చలామణీ అవుతున్న ఆకర్షణా, దానికి మూలమయిన అందము, అయిశ్వర్యము, అంతస్తులూ, కర్కశమయిన, కఠినమయిన, క్రూరమయిన వాటి తీరుతెన్నులూ, మనుషుల్ని దారుణంగా అణగద్రొక్కి

వికటంగా నాట్యమాడే వాటి విన్యాసాలూ ఇక్కడ ముఖ్యంగా పరిగణనలోకి తీసుకోబడినాయి.

అందువలన, ఇక్కడ, సబిత— ఆమె నిర్ణయం ప్రముఖమయిన స్థానం ఆక్రమించింది.

అందుకే— ఈ ఆందోళితమయిన మనఃస్థితి! పూగిసలాట.

ఒకసారి మెడలో తాళి కట్టేయించుకుంటే — సబితయొక్క గర్వం, దర్పం, అతిశయం అనే ఆ అంశాల్ని ఎలాగ అణగద్రొక్కి, నా సుపీరియారిటీని ఎస్టాబ్లిష్ చేసుకోవాల్నో— అన్నీ వివరంగా ప్లాన్సు వేసుకుని వున్నాను. ఒక విషయాన్ని విశ్లేషించి, పద్ధతి ప్రకారం నాకు సానుకూలంగా ఎలాగ మలచుకోవాలో నాకు తెలుసు. నా తెలివితేటల్ని గురించి మా నాన్నగారు ఇచ్చిన సర్టిఫికేట్ అకారణమూ, అనాలోచితమూ కానేకాదు. ఆ విశ్వాసం నాకుంది. గమ్యం చేరాక — రమణయ్యనాయుడుగారింట్లో నాకు అపూర్వమయిన స్వాగతం లభించింది.

కాని, సమయానికి ఆయన ఇంట్లో లేరు ! అవసరమయిన పనిమీద మద్రాసు వెళ్ళారనీ, నాల్గు రోజుల దాకా రారనీ తెలిసింది. ఛీ!

స్నానం చేసి బట్టలు మార్చుకుని, కాఫీ తాగి రిఫ్రెష్ అయాక సబిత నాకు దర్శనం ఇచ్చింది. మయూరిలా, రాజహంసలా నడిచి వచ్చి నన్ను సమీపించి —

'గుడ్ మార్నింగ్' అని సమ్మోహనకరంగా నవ్వింది.

'వెరీ గుడ్‌మార్నింగ్!' అన్నాను గుండెల్లో ఆనందం గంతులువేస్తుండగా.

వయ్యారంగా సబిత నా ఎదురుగా సోఫాలో కూర్చుంది. నౌకరు లోపల్నుంచి ట్రేలో వేడివేడి టిఫెన్ తెచ్చాడు. ప్లేటులో సర్ది నాకందించింది సబిత.

'థాంక్సు.'

'నో మెన్షన్' నవ్వింది సబిత. తెల్లని పలువరుసల మెరుపులు నన్ను సమ్మోహితుడిని చేసాయి. ఆ పలువరుసలను కప్పుతూన్న ఎర్రని తడి పెదాలు ! పూర్ణమై, అనురాగభరితమై, ఆకర్షకమై మనసునిపట్టి లాగుతూ—ఎర్రని వంటిని కప్పుతూ వెలాతెలా పోతూవున్న ఎర్ర చీర, ఎర్ర జాకెట్టూ — ఎగసిపడుతూన్న యవ్వనం. కాని ఆ కదలికలలో అతిశయం, దర్పం! అదే నాకు నచ్చదు. పళ్ళు కొరుక్కున్నాను—కసిగా.

ఏవేవో విషయాలు చెప్పింది సబిత ! వినటం నావంతు. గర్వం ఆమె మాటలలోనుంచి పొంగి పొరలుతూ వుంది. నా గుండె నిండా కసి పేరుకుని పోతూవుంది!

'సారీ! మీరు వచ్చేప్పటికి నాన్నగారు లేరు! అమ్మ ఏవో మీటింగులని ఢిల్లీ వెళ్ళింది. సారీ ఫర్ ది ఇన్‌కన్వీనియన్స్'అంది సబిత నన్ను పరిశీలనగా చూస్తూ.

'ఫరవాలేదు. నేను వచ్చింది వాళ్ళకోసం కాదు. మీకోసం' అన్నాను మిత్తుపనిగా నవ్వి. ఆ నవ్వు ఆమెను పడవేస్తుందని నా అంచనా.

'వాట్ డూ యూ మీన్ !' అని ఆశ్చర్యపోయింది సబిత. అటో ఇటో తేల్చేయాలి. ముసుగులో గుద్దులాటలొద్దు. 'అవును సబితా ! మన మాచ్ గురించి పెద్దవాళ్ళ మధ్య మాటలు నడిచాయి. మనం ఓ.కే. అనటమే మిగిలింది. ఐ లవ్ యూ సబితా' ఆవేశంగా అన్నాను. నేను తొందరపడ్డానా ? ఆ తొందరపాటులో ఫూల్‌లాగ ప్రవర్తించానా ? ఆ వెంటనే — భయంకరమయిన సిగ్గులో మునిగిపోయాను. నేను తలవంచుకుని ఆమె సమాధానం కోసం ఎదురుచూసాను ఎంతో ఆత్రుతతో. కొన్ని క్షణాలు దొర్లాయి.

సబిత తత్తరపాటుని అణచుకుని మెల్లగా అంది చివరికి—

"అవున్నిజమే. ఈ విషయం ఆ మధ్యన నాన్నగారు చెప్పారు. కాని, నా పెళ్ళి గురించి నా అభిప్రాయాలు వేరేవున్నాయి. నేను ఒక డాక్టర్ని ప్రేమించాను. ఆయన ఇపుడు అమెరికాలో వున్నారు. ఐ లవ్డ్ హిమ్. అయ్ లవ్ అమెరికా. సారీ బాస్, అయాం సారీ." ఆ మాటలు దృఢంగా, కఠినంగా వినవచ్చాయి. నా మొహం ఎర్రగా అయింది. నా నరాలు బిగదీసుకునిపోయాయి. నా నోరు పెగిలి రాలేదు. ఒక పిరికితనం నన్నావహించింది. ఇన్‌ఫీరియారిటీ నన్ను లోబరచుకుంది. ఐ వజ్ కట్ టూ సైజ్! భయం, దిగులూ నన్ను లోబరచుకున్నాయి. నా అతిశయం, దర్పం, అహంకారం, దారుణంగా, నిలువునా కరిగి నీరయిపోయాయి. నేను చిన్నగా, అతిచిన్నగా అయిపోయాను. నా ప్లాన్స్ అన్నీ భయంకరంగా ముక్కలు ముక్కలుగా అయిపోయాయి. నా అయామె పూర్ సోల్ ! నేనేమయిపోతున్నాను ?! ఆమె ఎదుట—ఆ భయంకర రాక్షసి సబిత ముందు నేను ఇక క్షణమాత్ర కాలం కూడా కూర్చోలేను...లేను. అయిపోయింది. పేకమేడలు కూలిపోయాయి.

'సారీ, ఫ్రెండ్. నేను వెంటనే ఒక ఫంక్షన్‌కి ఆటెండవాలి. మా ఫ్రెండ్ బర్త్ డే పార్టీ ! వుంటారుగా. వస్తాను' — అని లేచి వయ్యారంగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది—సబిత. సబితా ద డెవిల్ ! ఓపెన్ చేసిన గేటునుంచి, సబిత ఎక్కిన లైట్ బ్లూ ఫియట్ దూసుకునిపోయింది ! ఎంత గర్వం !? ఈమెనా నేను పెళ్ళాడదల్చుకున్నది ?

సబిత అందము, అయిశ్వర్యము, అంతస్తూ-నాతో క్రూరంగా ఆడుకున్నాయి. పూర్తిగా ఓడిపోయాను. నేను మాత్రం ? వాటి వలలోనేపడి పరుగులెత్తి నేనూ లలితతో మరింత భయంకరంగా ఆటలాడలేదా ? కానీ, దానికి నేను గుర్తింపు ఇవ్వలేకపోయాను. స్వార్థం అనబడే ఆజ్యం మీదపడగా ఎగసిపడే అరిషడ్వర్గాలమంటలే అందుకు కారణమని నాకు తెలుసు. ఆ మంటలు మనిషిని దహించివేస్తాయి. అందులోంచి మనిషికి లభ్యమయ్యేది దుఃఖం, భయం, బాధ. వాటిలోంచి పుట్టుకుని వచ్చినవే, పిరికితనం, అలసత్వం. అందుకే అన్నాను. ఇది ప్రేమ కథగాదు. ప్రేమగా చలామణీ అవుతున్న ఆకర్షణ — దానికి మూలమయిన అందమూ, అయిశ్వర్యమూ, అంతస్తూ—కర్కశమయిన, కఠినమయిన, క్రూరమయిన వాటి పద్ధతులలో పడి నలిగి, గాయపడి, నెత్తురుకార్చే గుండెల మూల్గులూ—నా కథకి ప్రధానమయిన వస్తువులు విషాదం నిండివున్న ఈ తరపు కథ ఇది !

'కాగా, మానవమాత్రుడ్నే గనుక, నా వైఫల్యం నన్ను కన్నీటిలో ముంచెత్తకా, ఆ ప్రళయ సదృశమయిన ప్రవాహంలోపడి నేను కొట్టుకునిపోకా తప్పదు...తప్పదు.

దీనంగా — తలవంచుకుని, నా సూట్‌కేసుని తీసుకుని, ఆ ఇంటినుంచి బయటపడదామని అడుగులు వేసాను. అంతవరకూ నేను కూర్చునివున్న ఆ సోఫాలో, నా జేబునించి ఎలాగో జారిపడిన, ఆ పార్కర్ పెన్ను, మెరుస్తూ స్నిగ్ధంగా, అమాయకంగా పలకరించింది! దాన్ని అక్కడ్నే వదిలి రోడ్డుమీద పడ్డాను! తిరోగామినై ప్రయాణానికి సిద్ధమయ్యాను. ★

